# 18మంది పిల్లల తల్లి



జనాభా నియంత్రణ పాటించాల్సిన ఈరోజుల్లో కూడా 44 ఏళ్ళ ఓ మహిళ 18మందికి జన్మనిచ్చింది. కెనడాకి చెందిన లివియా లాస్, అలెగ్జాండ్రు భార్యాభర్తలు. 23 ఏళ్ళక్రితం వీరిద్దరికీ పెళ్లయింది. అప్పటినుంచీ లివియా పిల్లల్ని కంటూనే... వుంది. ఇప్పటివరకూ ఆమె 18మందికి జన్మనిచ్చింది. వీరిలో 10మంది అమ్మాయిలు, ఎనిమిది మంది అబ్బాయిలు. ఈమధ్య జన్మించిన 18వ సంతానం పేరు అబిగాలి. ఇప్పటివరకూ 17మందికి జన్మనిచ్చిన లివియా ఈమధ్యే మరో బిడ్డకు జన్మనివ్వడంతో ఆ బిడ్డ ఆరోగ్యపరిస్థితి గురించి భర్తతో సహా డాక్టర్లు కూడా అనుమానం వ్యక్తం చేసారు. అయితే అదృష్టవశాత్తూ ఆ బిడ్డ మిగతావారిలాగే చాలా ఆరోగ్యంగా వుండడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తండ్రి అలెగ్జాండ్రుకి ఇప్పుడు 51 సంవత్సరాలు.

ఈ జంట 1990లో రుమేనియా నుంచి కెనడాకి వలస వెళ్లిపోయింది. మాకు పెళ్ళయినప్పుడు ఇంతమందికి పిల్లలకి జన్మనిస్తామని ఎప్పుడూ అనుకోలేదు. అలా అని పిల్లల్ని కనడం ఆపబోమంటున్నారు ఆ దంపతులు. 'పిల్లలందరూ చాలా ఆరోగ్యంగా ఉన్నారు. థ్యాంక్యూ గాడ్' అంటోందామె. అన్నట్టు వారి మొదటి సంతానం ప్రస్తుత వయసు 23 సంవత్సరాలు. పాలుతాగే పిల్లాడు నుంచి యుక్తవయసులో వున్న పిల్లల వరకూ అందరూ వాళ్లింట్లో వున్నారు. వారంతా చాలా సంతోషంగా, సరదాగా వుంటారు. ఇంతమంది పిల్లల్ని కనడం, పెంచడం కష్టంగా లేదా అంటే లివియా మాత్రం చాలా సంతోషంగా ఉందంటోంది. అయితే ఎక్కువ మంది పిల్లల వల్ల తమకు నిద్ర తక్కువగా వుంటోందని, వారి ఆలనాపాలనాకే ఎక్కువ సమయం పడుతోందని ఆ జంట చెప్పుకొచ్చింది. ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేస్తున్న అలెగ్జాండ్రు రోజూ 60 కిలోమీటర్ల మేర ప్రయాణం చేసి వచ్చినా పిల్లల్ని చూసుకోవడంలో భార్యకి సహకరిస్తుంటాడు. వారికి కలిగిన పద్దెనిమిదవ సంతానం గురించి వాకబు చేయడానికి కెనడా, జర్మనీ, రుమేనియా, ఇంగ్లాండ్ దేశాల మీడియా ప్రయత్నించింది. మీడియా మొత్తం సంభ్రమానికి గురికావడం ఇప్పటికీ తాను మరిచిపోలేనని అలెగ్జాండ్రు అంటున్నారు. తామేమీ రికార్డులు బద్దలు కొట్టడానికి ఇంతమందిని కనలేదని ఆ జంట చెప్పడం కొసమెరుపు.

## 'సరసి'కత

వైశంపాయనుడుగారు తల్లి తిమ్మాయమ్మ గారిని వెంటబెట్టుకుని ఆటోలో సికిందరాబాదు రైల్వేస్టేషనుకి బయల్దేరాడు. తిమ్మాయమ్మ గారి చెల్లెలు విశాఖపట్నంలో లక్షవత్తుల నోము నోచుకుంటోందట. "తీసుకెళ్లరా అబ్బాయ్" అని తల్లి అడగ్గానే ఏ కళనున్నాడో 'సరే' నన్నాడు కొడుకు.

దార్లో ఓ చోట ఆటో ఆపి, ఐదునిమిషాల్లో తిరిగిచ్చాడు వైశంపాయనుడు గారు. తల్లి అడిగితే "ఏటీఎం అనీ... ఇదిగో ఈ కార్డు చూపిస్తే డబ్బులు రాల్తాయి. ఇందుకోసమే వెళ్లా" అన్నాడు స్టైల్‌గా. ఆ కార్డు అందుకుని అటూ ఇటూ తిప్పి ఆశ్చర్యంగా చూసిందావిడ! గోదావరి ఎక్స్‌ప్రెస్ పరుగెడుతోంది. "రాజమండ్రి ఎప్పుడొస్తుందిరా?" అడిగింది తల్లి. "ఇంకా ఖాజీపేటే రాలేదు అప్పుడే రాజమండ్రియా? ఏ అర్ధరాత్రో అవుతుంది, పడుకో" అన్నాడు కొడుకు. ఆవిడ పడుకోలేదు. రాజమండ్రి తీపి జ్ఞాపకాలు నిద్ర పోనివ్వవు. అది తను పుట్టినవూరు. తల్లీ తండ్రీ, తను పెరిగిన వాతావరణం, ప్రశాంత గోదావరీ – తలచుకుంటేనే వొళ్లు పులకరిస్తుంది. మొత్తం కంపార్టుమెంటు అంతా నిద్రలో

# గోదావరి



జోగుతోంది. కలత నిద్ర నించి ఉలిక్కిపడి లేచింది తిమ్మాయమ్మగారు. ఓ కుర్రాడెవరో పక్క కిటికీలోంచి బయటకు తొంగి చూస్తున్నాడు. ఏవిటని అడిగితే "గోదావరి" అన్నాడు. "అయ్యో అదేవిటీ బ్రిడ్జి చప్పుడు చేస్తుందికదా" అందావిడ హడావుడిగా లేస్తూ. "కొత్త బ్రిడ్జి చప్పుడు చెయ్యదు మామ్మగారూ" అన్నాడా కుర్రాడు. తిమ్మాయమ్మగారు ఆ కుర్రాడి చేత లైటు వేయించుకుని హడావుడిగా డబ్బుల కోసం వెతుక్కుంది గోదావరిలో వెయ్యడానికి. కొంగున ముందుగానే చెల్లర డబ్బులు కట్టుకోనందుకు తనని తానే తిట్టుకుంది. కొడుకుని లేపుదామంటే అతగాడు పై బెర్తులో గుర్రుకొట్టి నిద్రపోతున్నాడు. లేపే వ్యవధి లేదు. ఆలస్యం చేస్తే ఎక్కడ గోదావరి దాటిపోతుందోనని కంగారు మొదలైంది. పక్కనే కొక్కేనికి తగిలించిన కొడుకు చొక్కా కనిపించింది. జేబులో చెయ్యిపెడితే చిల్లరేమీ తగల్లేదు గానీ ఏటీఎం కార్డు చేతికి తగిలింది. కార్డు గురించి కొడుకు చెప్పిన మాటల్ని గుర్తుకు తెచ్చుకుని దాన్నే మహాలక్ష్మిగా కళ్లకద్దుకుని కిటికీలోంచి గోదావరిలోకి విసిరేసి నమస్కారం చేసింది తిమ్మాయమ్మగారు.

*